# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం 28 05 2025

సంపుటి 1 సంచిక 29

UDYAM / TS-09-0148996









## సామాజిక ఉద్యమంగా వన మహోత్సవం...


2025 సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతుంది.

దశ , హైదరాబాద్



బిజెపి సీనియర్ నేత, కేంద్ర రోడ్ రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కారీ జన్మదిన సందర్భంగా మనసురాబాద్ డివిజన్ పరిధిలోని శివాలయంలో మంగళవారం బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, నందికొండ గీతారెడ్డి, తుంగతుర్తి బిజెపి ఇన్చార్జి కడియం రామచంద్రయ్య, నాయకులు దండ శ్రీనివాస్ రెడ్డి, సామ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశ, ఎల్బీనగర్



## 1000 దాటిన కోవిడ్ కేసులు

దేశవ్యాప్తంగా మళ్లీ కరోనా వైరస్ వ్యాప్తి ప్రజలను కలవరపెడుతోంది. గత వారం రోజుల్లోనే 750 మందికి పైగా ఈ వైరస్ బారిన పడినట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. కేరళలో కొత్తగా 335 మహారాష్ట్రలో 153, ఢిల్లీలో 104 కేసులు నమోదు అయ్యాయి. గుజరాత్‌లో 83, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్ లో 12 కేసులు ఉన్నాయి.

దశ , న్యూఢిల్లీ



## యువతకు ప్రథమ చికిత్స పైన అవగాహన ఉండాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి

దశ.చేవెళ్ల: యువతి యువకులుకు ప్రథమ చికిత్స పైన అవగాహన కలిగి ఉండాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి అన్నారు . తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేన దళ్ శిక్షణ శిబిరంలో భాగంగా రెండవ రోజు మంగళవారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు . కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ,చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి రెడ్డి ,మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్, షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, కృష్ణ పాల్గొన్నారు.

# కేబినెట్ విస్తరణకు ముహూర్తం?



## సామాజికవర్గం, జిల్లాల వారీగా పేర్లు ఎంపిక!

దశ , రంగారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోనే బస చేయడంతో మంత్రి వర్గ విస్తరణ కోసమేనని జోరుగా ప్రచారం జరుగుతోంది. నీతి ఆయోగ్ భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పెద్దలతో భేటీ అయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జితో చర్చించారు. ఆదివారం రాత్రి సమావేశంలో ఓ నిర్ణయానికి రాలేకపోవడంతో సోమవారం కూడా సీఎం ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది.తెలంగాణ మంత్రి వర్గంలోకి కొత్తగా ఎంతమందికి అవకాశం కల్పించాలనే విషయంలో పార్టీలో చర్చ కొనసాగుతోంది. మంత్రి వర్గ రేసులో మహబూబ్ నగర్ నుంచి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి. సుదర్శన్ రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆదిశ్రీనివాస్, మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్ వంటి వారు పోటీ పడుతున్నారు. వీరిలో నలుగురికి మాత్రమే చోటు దక్కే అవకాశం ఉంది.మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరు కూడా కొత్తగా తెరపైకి వచ్చింది. సామాజిక వర్గాల వారీగా చూస్తే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి ,సుదర్శన్ రెడ్డి, వెలమలలో ప్రేమ్ సాగర్ రావు, ఎస్సీలలో గడ్డం వివేక్, ఎస్టీలలో బాలూనాయక్, శంకర్ నాయక్, ఓబీసీ నుంచి వాకాటి శ్రీహరి, విజయశాంతిల పేర్లు ఉన్నాయి. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్, ఫహీమ్ ఖురేషీల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే ఒక్కో వర్గం నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయిఇక హైకమాండ్ పిలుపుతో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తదితర తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై చర్చలు జరిపారు. అయితే ఈ చర్చల్లో మంత్రివర్గ విస్తరణపై చర్చలు కొలిక్కి రాగా.. పిసిసి కార్యవర్గ కూర్పు పై మాత్రం ఇంకా స్పష్టత రానట్టు తెలుస్తోంది. అయితే ఎమ్మెల్యేల నుంచి వచ్చిన వినతులను సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా వాటిని పరిశీలించిన అధిష్టానం సామాజికవర్గం, జిల్లాల వారీగా పేర్లను ఎంపిక చేసినట్టు సమాచారం. అయితే ఈ జాబితాను ఇవాళ మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనాయకులు ఖర్గే, రాహుల్, కేసి వేణుగోపాల్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ సమావేశం తర్వాత మంత్రివర్గంలోని పేర్లను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కేబినెట్ విస్తరణ కొలిక్కి వచ్చినా పిసిసి కార్యవర్గంపై మాత్రం ఇంకా చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. పీసీసీ కార్యవర్గ కూర్పులో సామాజిక సమీకరణాలకు కాంగ్రెస్ పెద్దపీట వేసున్నట్టు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సుమారు 70 శాతం అవకాశం కల్పించనున్న కాంగ్రెస్ వర్గాలు చర్చ జరుగుతోంది.

# ఆపరేషన్ కగార్‌తో బూటకపు ఎన్‌కౌంటర్లు

### రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి



దశ , అబ్దుల్లాపూర్‌మెట్ : ఆపరేషన్ కగార్ తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్ కౌంటర్లకు పాల్పడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి అన్నారు. రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రాజీవ్ గృహకల్పశాఖ మహాసభ కామ్రేడ్ డావుల రాములు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఆపరేషన్ కగార్"తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్ ఎన్ కౌంటర్‌లో పట్టుకొని కాల్చి చంపారని.. కనీసం మృతి చెందిన వారి భౌతిక కాయాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా.. పోలీసులే సామూహిక దహనాలు చేయడమేమిటని ప్రశ్నించారు. శాంతి చర్చలకు అంగీకరించకుండా మొండికేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి.. చర్చలు జరపాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్ , యాదయ్య, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు



మందకృష్ణ మాదిగ కు రాష్ట్రపతి ద్రౌపదిముర్మ చేతుల మీదగా మంగళవారం పద్మశ్రీ అవార్డు ప్రధానం చేశారు. పద్మ అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా ఇటీవల పద్మశ్రీ అవార్డు(మానవ వ్యవహారాల విభాగంలో)కు ఎంపికైన మందకృష్ణ మాదిగ కు రాష్ట్రపతి భవన్ న్యూఢిల్లీలో అవార్డు ప్రధానం చేశారు.

( దశ, రంగారెడ్డి )



# సమస్యల వలయంలో ఆర్కెనగర్

### పట్టించుకోని గత పాలకులు, రోడ్లపైనే పారుతున్న మురుగు.
### డ్రైనేజీకి తవ్విన మట్టి రోడ్లపైనే.. డ్రైనేజీ లేకుండానే సీసీ రోడ్లు
### కమీషన్ల కోసం తూతూ మంత్రంగా పనులు: మల్లేపాక మల్లేష్

దశ, పెద్దఅంబర్ పేట: పెద్దబర్పేట మున్సిపాల్టీలోని తట్టి అన్నారంలో పరిధిలో గల ఆర్కెనగర్ సమస్యల వలయంలో అవస్థలు పడుతుంది. సుమారు పదిహేను వందల కుటుంబాలు ఉన్న ఈ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని స్థానికులు వాపొతున్నారు. డ్రైనేజీ పనులు చేపట్టకుండానే వేసిన సీసీ రోడ్ల కారణంగా . మురుగంతా రోడ్లపైనే పారుతుందని అంటున్నారు. కొన్ని కాలనీలలో డ్రైనేజీ పనుల నిమిత్తం తీసిన మట్టిని రోడ్లపైనే పొయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గత పాలకుకు కమీషన్ల కోసం చేపట్టిన పలు పనులు స్థానికులను "ఇబ్బందుల పాలు చేస్తున్నదని స్థానికులు ఆరొపిస్తున్నారు. ఆర్ కె నగర్ లో చేపట్టిన డ్రైనేజి పనుల కారణంగా మురుగును బయటికి తరలించేందుకు సరైన ఔట్లెట్ లేక రోడ్లపై పారుతోందని వాపోతున్నారు . సిసి రోడ్ల పైన పారుతున్న మురుగు కారణంగా ఇప్పటికే పలు ద్విచక్ర వాహనాలు జారి పలువురు గాయాలపాలయ్యారని వివరిస్తున్నారు. దీంతో పాటుగా ఇక్కడ తిరిగే ఆర్ఎంసి వాహనాలు రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు . డ్రైనేజి లేకుండా సిసి రోడ్లను చేపట్టడంతో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించలేకుండా పోయారని విమర్శిస్తున్నారు . రోడ్ల పైన పారుతున్న మురుగు కారణంగా దోమలు స్వైరవిహారం చేస్తూ స్థానికులను రోగాల బారిన పడేలా చేస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆర్ కె నగర్ లో సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు .







### కమిషన్లకు ఆశపడి ఇష్టారాజ్యంగా పనులు

కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు కమిషన్ల కోసం ఒక కక్కుర్తి పడి ప్రజలకు సరైన విధంగా ఉపయోగపడేలా కాకుండా ఇష్టానుసారంగా పనులు చేపట్టారని ఆరోపించారు . ఆర్ కే నగర్ లో చేపట్టాల్సిన పనులు అనేక ఉన్నప్పటికీ కూడా ఈ కాలనీకి వచ్చిన పనులను ఇతర కాలనీలకు కొంతమంది అమ్ముకొని కమిషన్లు తీసుకున్నట్లు కాలనీవాసులు అందరికీ బహిరంగ సమాచారం ఉందని ఆరోపించారు . సిసి రోడ్లు ముందుగా వేసి తర్వాత డ్రైనేజి పనులు చేపట్టడం కారణంగా ఈ రోడ్లన్నీ రాళ్లు రప్పులతో పెద్ద ఎత్తున ఉంటాయని తద్వారా రోడ్లన్నీ పూర్తిగా ద్వంసం అవుతున్నాయని అన్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా కాలనీలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

- మల్లేపాక మల్లేష్

# ఘనంగా అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు



దశ ,ఎల్బీనగర్ : మనసురాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్ శివాలయంలో మంగళవారం పుణ్యశ్లోక లోకమాతారాణి అహల్యబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులను సన్మానించారు. కాలనీవాసులు, సీనియర్ సిటిజన్స్, పలువురు ప్రముఖులు అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్రను వివరించారు. వేడుకల్లో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. "అహల్యాబాయి హోల్కర్ గారు కేవలం పరిపాలకురాలు మాత్రమే కాక, మానవతా విలువలను అమలు చేసిన ఆదర్శ రాజమాతగా నిలిచారన్నారు. ఆమె పాలనలో మహిళల గౌరవానికి, పేదల సంక్షేమానికి, ధార్మిక అభివృద్ధికి అమూల్యమైన స్థానం లభించింది," అని తెలిపారు. అహల్యా బాయి జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అహల్యాబాయి ఉత్సవాల కమిటీ కన్వీనర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, కో కన్వీనర్ నందికొండ గీతారెడ్డి, తుంగతుర్తి నియోజకవర్గం ఇంచార్జి కడియం రామచంద్రయ్య, దండశ్రీనివాస్ రెడ్డి , సామ మహేందర్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు జయప్రకాష్, ఆదినారాయణ, నాయకులు షకీల్ మీర్జా, అమరేశ్ ముదిరాజ్, పాతూరి శ్రీధర్ గౌడ్, బొంగు రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దశ
నిజం.. నిర్భయంగా..

## పెద్దల మాటలు - సద్ది మూటలు

- తలచిన పని తలచినట్టుగా కాలేదని తలపట్టుకొని కూర్చునే అవుతుందా? తల తాకట్టు పెట్టో తలనీలాలిచ్చో సాధించాలి నీ ధ్యేయం.
- కష్టాలెన్ని వచ్చినా కపా నష్టాలెన్నో భరించినా కన్నీళ్ళు తుడ్చే అప్పుడు కనీసం ఒకడుంటే చాలు.
- ప్రజలకు కావల్సింది నీ తెలివితేటలు కాదు నీ సిరిసపందలు కావు నీలోని మంచితనం
- తీర్పు చెప్పేవాడికి నేర్పు అవసరం పాఠం చెప్పేవాడికి ఓర్పు అవసరం.
- ఆడుతూ ప్రారంభించిన పని పాడుతూ పూర్తిచేశాడు అన్నిటికీ అనుమానపడే పక్షి ఏమీ సాధించలేక పోయాడు.
- పదిమంది నడచిన రహదారిలో నడిస్తే నీ ప్రత్యేకతేమున్నది నీదైన ఒక దారిలో నడిచి నీ దారిని రహదారిగా మార్చు.
- పనిలో ప్రతికూలత వచ్చిందని ఆ పనికి తిలోదకాలిస్తే ఎలా? గాలి ప్రతికూలంగా వున్నపుడే కదా గాలిపటం ఎగిరేది అలా అలా!
- ఏ దిశకు అంధకారం ఆసరిస్తుందో ఆ దిశనుండే ఆశాకిరణం ఉదయిస్తున్నది ఎక్కడ తారలు అస్తమిస్తున్నవో అక్కడి నుండే సూర్యుడుదయిస్తున్నాడు.
- శారీరక బడలిక వల్ల రాదు జబ్బు మానసిక రుగ్మతవల్ల వస్తుంది ఎన్ని మైళ్ళు నడిచినా ఎన్ని గంటలు పని చేసినా అనుకున్న పని అయితే అలసటెక్కడిది?
- లక్షలు సంపాదించే లక్షాధికారీ జీవితంలో ఏదో కొరవడిందని బాధపడుతున్నావా నీవు కోరుకునే తృప్తి కిళ్ళీకొట్టు వాడి కళ్లలో కనిపిస్తుంది చూడు!



బుధవారం
28-5-2025
WWW.
DASHANEWS
.COM

## లోకల్ బస్టాండ్ బ్రతుకు చిత్రం

లోకల్ బస్టాండ్
ప్రైవేట్ వాహనాల అడ్డ
దూర ప్రయాణికులకు
సరుకు రవాణా యజమానులకు

కూర్చొటానికి
ఏ సౌకర్యాలు ఉండవు
బస్సు కొరకు ఎదిరిచూడాలి
పడిగాపులు పడాలి
అప్పుడప్పుడు వచ్చే వాటిలో సీట్
ఏతుక్కోవాలి

అంతా మార్కెట్ అక్కడే ఉంటుంది,
ఆకలేసిన,దాహం అయినా
ఏదోవొకటి దొరుకుతుంది,
పైసలుంటే ఆకలి తీర్చుతుంది

ఒకరికిఒకరు పరిచయం అవుతారు,
ఎదో మాట్లాడుకుంటారు
వాదొపవాదాలు చేసుకుంటారు,
అక్కడినుండి నిష్క్రమిస్తారు

ఉన్న కొద్ది సేపట్లో
ఊరి ముచ్చట్లు, ప్రయాణ ఇక్కట్లు
కుటుంబ విషయాలు
రాజకీయ విశ్లేషణలు చేస్తారు
ఒకరిపై ఒకరు పైచేయి సాధించినట్లు
భ్రమపడతారు

టైం పాసుకు కొందరు
టైమ్ తెలియక మరికొందరు
తెలిసిన వారు తారసపడతారు
ఇద్దరు ఇంకొకరి కొరకు చూస్తారు

ఆ బస్టాండ్లో కాసేపు ఉంటే
బ్రతుకు చిత్రం కనబడుతుంది
నిజజీవితం అర్థమౌతుంది
ఉన్నోడు, లేనోడనే తేడా తెలుస్తుంది

లోకల్ బస్టాండ్ ను మరువలేము
ప్రయాణికుల భాదలు చూడలేము
అంతా కళ్ళకుకట్టినట్లు, ఎప్పటికప్పుడు
సీన్లు మారుచున్నట్లు అనిపిస్తుంది.

రచన:
కడెం. ధనంజయ, చిత్తలూర్

# అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

- మేయర్ విజయలక్ష్మి ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష
- సమస్యలపై వినతిపత్రాలు అందజేసిన ఆయా డివిజన్ల కార్పొరేటర్లు



**దశ, ఎల్బీనగర్:** అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, ఇంకా ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించాలని, అధికారులు నిర్లక్ష్యం వీడి పనులను నిరంతరం పర్యవేక్షించాలని మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు. ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు, అధికారులతో సమావేశమై సమీక్షించారు. డివిజన్ల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి డివిజన్ కు భారీగా నిధులు మంజూరు చేసినట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస, మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో డ్రైనేజీ పనులు, వరద కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు వివరించారు.

నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ మాట్లాడుతూ.. నాగోల్ చెరువును అభివృద్ధి చేసి, రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ మాట్లాడుతూ... హస్తినాపురం డివిజన్ పరిధిలో ఎస్ఎన్ డీపీ పనులు నత్తనడకన జరుగుతున్నాయని, ఏపీ ఎస్సీబీ కాలనీ నుంచి బైరామల్ గూడ చెరువు వరకు జరుగుతున్న పనులు నత్త నడకన సాగుతున్నాయని తెలిపార. వందనపురి కాలనీ నుంచి కేకే గార్డెన్ వరకు, ద్వారకా నగర్ నుంచి డీ ఆర్ డీ ఎల్ కాలనీ వరకు పనులను ఇంకా ప్రారంభించలేదన్నారు. బీఎన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయాలని, శివారు కాలనీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కాలనీల్లో ఖాళీగా ఉన్న పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... వనస్థలిపురం డివిజన్ కాలనీల్లో రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించడంతోపాటు పార్కు స్థలాలను కాపాడాలని కోరారు. కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. కొత్తపేట డివిజన్ పరిధిలో సీసీ రోడ్లను మంజూరు చేయాలన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైనేజ్ లు నిర్మించాలని కోరారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి మాట్లాడుతూ... ఈస్ట్ జోన్ లో వసూలు చేస్తున్న రూ, 700 కోట్లు పన్ను రాబడి ఆదాయాన్ని స్థానిక డివిజన్ల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి మాత్రమే కేటాయించాలన్నారు. మన్సూరాబాద్, హయత్ నగర్ శివారు కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులు, మంచినీటి పైప్ లైన్లు తదుపరి వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలనీలల్లో పార్కు స్థలాలు కబ్జా కాకుండా చూడాలని కోరారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు లోకి మురుగు కలవకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- జిల్లా అధ్యక్షురాలు వురిమల్ల గీత
- ప్రధాన కార్యదర్శి, పాడిశెట్టి సైదులు





**దశ , సూర్యాపేట:** స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం సూర్యాపేట పట్టణంలో సామి నారాయణ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వురిమల్ల గీత, ఉపాధ్యక్షులుగా హసానబాద శ్రీనావాస్, ప్రధాన కార్యదర్శిగా పాడిశెట్టి సైదులు, కార్యదర్శిగా మట్టపల్లి సైదులు, కోశాధికారిగా పి.వనజ, జిల్లా కౌన్సిలర్గా షేక్ నీలోఫర్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేవ విద్యావిధానాన్ని పటిష్టపరచడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రత్యేక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## స్కూటీని ఢీకొట్టిన లారీ.. ఒకరికి తీవ్ర గాయాలు

- అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** స్కూటీని ఢీకొట్టిన లారీ.. ఒకరికి తీవ్రగాయాలు అయిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్ ఎఫ్‌సీ సెక్యూరిటీ ఆఫీసర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్‌కు చెందిన వట్టిపాక అశోక్‌కుమార్ (35) బిల్ కెప్టెన్‌గా రామోజీ ఫిలింసిటీలో పనిచేస్తుంటాడు. మంగళవారం సాయంత్రం ఉద్యోగం నిమిత్తం అశోక్‌కుమార్ తన స్కూటీతో రామోజీ ఫిలింసిటీ బయలుదేరారు. ఆర్ ఎఫ్‌సీ మెయిన్ గేట్ వద్ద యూ టర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఆర్‌జే-11-జీసీ-0188 నెంబర్ గల లారీ వెనుక నుంచి స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో అశోక్ కుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రయివేట్ దవాఖాన తరలించారు. లారీ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు తెలిపారు. రామోజీ ఫిలింసిటీ సెక్యూరిటీ ఆఫీసర్ దాసు చిన్నమ్మ నాయుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అబ్దుల్లాపూర్ మెట్ ఇన్‌స్పెక్టర్ వి. అశోక్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణలో భారీ వర్షాలు : వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ



దశ, హైదరాబాద్: తెలంగాణలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ ఆదిలాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సంగారెడ్డి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో వర్షం పడే ఛాన్స్ ఉందని.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.కాగా, రాష్ట్రంలో గత మూడు రోజులుగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. వానల కారణంగా పంటలు తడిసి దెబ్బ తినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని జిల్లాల్లో మంచు ముసురు కరుస్తూ వాతావరణం చల్లగా ఉంది.

# భర్తను చంపిన భార్య?


- ప్రమాదవశాత్తూ ఇంట్లో పడి చనిపోయాడు అని నమ్మించే యత్నం..
- కేసు దర్యాప్తు చేస్తున్న వనస్థలిపురం పోలీసులు



**దశ, ఎల్బీనగర్:** కుటుంబ కలహాలతో జరిగిన గొడవలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. భర్తను భార్యనే చంపినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...
యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండలం సభవత్ తండాకు చెందిన కిషన్ నాయక్ (40), యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన చెందిన శిరీష(28)ను 8 ఏండ్ల క్రితం కులాంతర వివాహం చేసుకుంటున్నాడు. జీవనోపాధి కోసం వనస్థలిపురంలోని హిల్స్ కాలనీలో నివాసముంటున్నారు. కాగా, కుటుంబ కలహాలతో నేపథ్యంలో శిరీష, కిషన్ నాయక్ వేర్వేరుగా ఉంటున్నారు. అయితే, శిరీష భర్త కిషన్ నాయక్ ను ఇంటికి పిలిపించింది. సోమవారం రాత్రి ఇంట్లో మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో భర్తను నెట్టివేస్తే కింద పడడంతో శిరీష తన చున్నితో కిషన్ నాయక్ గొంతు నులిమి హత్య చేసింది. సమాచారం తెలుసుకున్న కిషన్ నాయక్ కుటుంబ సభ్యులు హిల్స్ కాలనీకి చేరుకున్నారు. పథకం ప్రకారమే కిషన్ నాయక్ ను ఇంటికి పిలిచిన శిరీష చున్నీతో ఉరివేసి హత్య చేసినట్లు ఆరోపించారు. కిషన్ నాయక్ కుమార్తె బిందు (19) ఫిర్యాదుతో వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో శిరీషతో సహా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కిషన్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

# రెండు ముక్కలుగా గ్రేటర్ హైదరాబాద్

- ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం
- ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కసరత్తు మొదలు



**దశ , హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను రెండు ముక్కలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనివల్ల అభివృద్ధి ఈజీ అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా హైదరాబాద్ మహానగరాన్ని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వరకు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది.అందులో భాగంగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధి దాదాపు 625 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్నది. ఇక మిగిలిన మున్సిపాలిటీలను వీలినం చేస్తే జీహెచ్ఎంసీ పరిధి 2వేల చదరపు కిలోమీటర్లకు పెరుగుతుంది. అప్పుడు దేశంలోనే అతిపెద్ద నగరంగా హైదరాబాద్ నిలుస్తుంది. అప్పుడు ఓఆర్ఆర్ వరకు ఉన్న నగరాన్ని ఒక్కటే కార్పొరేషన్ గా ఉంచడమా లేక రెండు భాగాలుగా విభజించడమా అనే విషయంలో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అయితే పరిపాలన సౌలభ్యం కోసం రెండు భాగాలుగా చేయడమే ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై ఢిల్లీ, ముంబై నగరాల విస్తీర్ణం, ఆ కార్పొరేషన్లు పనిచేసే తీరుపై అధ్యయనం చేయడానికి ఒక బృందం అయా నగరాల్లో పర్యటించేందుకు సిద్ధమైంది. కాగా ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం దాదాపు ఖరారు అయినప్పటికీ మొత్తాన్ని ఒక కార్పొరేషన్ గా ఉంచడమా? లేక రెండుగా విభజించడమా అనేదానిపై చర్చ సాగుతోంది. ఇక మున్సిపాల్ ఎన్నికల కోసం ఓఆర్ఆర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లో డిలిమిటేషన్ (వార్డుల పునర్విభజన) చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటికే ఆ ప్రక్రియను మొదలు పెట్టింది. అయితే ఓఆర్ఆర్ లోపల ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మాత్రం గ్రేటర్ పరిధిలోకి తెచ్చే ఉద్దేశంతో అక్కడ ఎలాంటి డిలిమిటేషన్ మొదలు పెట్టలేదు. మరోవైపు ఓఆర్ఆర్ పరిధిలో, ఓఆర్ఆర్ బయట ఒకే విధమైన అభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ కు వేర్వేరుగా ఇద్దరు కార్యదర్శులను నియమించారు.గ్రేటర్ ను విస్తరించడంలో భాగంగానే ఇద్దరు సెక్రటరీలను నియమించినట్లు తెలుస్తోంది. ఓఆర్ఆర్ వెంట ఉన్న 51 గ్రామాలను ఓఆర్ఆర్ లోపలి మున్సిపాలిటీల్లో కలుపుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రేటర్ విస్తరణ తప్పదనే సంకేతాలు ఇచ్చినట్లయింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 158 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఉన్నాయి.

ఇందులో ఓఆర్ఆర్ లోపల 28 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు.. ఓఆర్ఆర్ కు, ఆర్ఆర్ఆర్ కు మధ్య 18 మున్సిపాలిటీలు వాటి అవతల మొత్తం 130 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే ఢిల్లీని 2012లో పరిపాలన సౌలభ్యం కోసమని నార్త్, సౌత్, ఈస్ట్ అని మూడు భాగాలుగా విభజించి మూడు కార్పొరేషన్లుగా ప్రకటించారు. అయితే ఆ తర్వాతా 2022లో తిరిగి మూడింటిని ఒకే కార్పొరేషన్ కిందకు తీసుకువచ్చారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణం ప్రస్తుతం 1,400 చదరపు కిలోమీటర్లు. దీనివల్ల ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలు, పారిశుధ్య నిర్వహణ వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి.

## చెత్త వేయద్దన్నందుకు పారిశుధ్య కార్మికురాలిపై దాడి

**దశ, ఉప్పల్:** ఉప్పల్ సర్కిల్ లోని రామంతపూర్ రాంరెడ్డి నగర్ బై పాస్ రోడ్డు లో రోడ్డు పై చెత్తను శుభ్రం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై రాంరెడ్డి నగర్ నివాసి మణెమ్మ అనే మహిళ దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. రోడ్డుపై చెత్త వెయ్యవద్దు అని చెప్పినందుకు మున్సిపల్ సిబ్బంది పై దాడి చేసి వారి ఫోన్ పగులకొట్టింది మణెమ్మ. ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన మున్సిపల్ కార్మికులు. మున్సిపల్ కార్మికుల పై దాడి సీసీ కెమెరాలో రికార్డు తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

- రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి

**దశ, ఇబ్రహీంపట్నం:** అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరనీ రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులు గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి తో పాటు తులేకలాన్ మాజీ సర్పంచ్ చిలకల యాదగిరి లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పుల పాలైన మాజీ సర్పంచుల బాధలు వర్ణనాతీతమని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపోల్ మాజీ సర్పంచ్ గంగిరెడ్డి బల్వంత్ రెడ్డి, తులేకలాన్ మాజీ సర్పంచ్ చిలకల యాదగిరి అన్నారు. గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని ఏడాదిన్నర కాలంగా అడిగినా ఇవ్వకపోవడం సిగ్గుచేటు అని రాష్ట్రవ్యాప్తంగా ఆయాగ్రామలలో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన 1200 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల కుంటుంబాలు రోడ్డున పడే దాకా ప్రభుత్వం స్పందించదా అని ఆవేదన వ్యక్తం చేశారు. వందల కోట్ల రూపాయల బకాయిలు ఉంటే 153 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసేంత వరకు సర్పంచుల పోరాటం ఆగదని ఆయన తెలిపారు.

# ఈ లేడి...కిలేడీ..

- కలెక్టర్ అయ్యానంటూ అమాయకులను బురిడీ కొట్టించి బుట్టలో వేసుకున్న వైనం
- ఈజీ మనీ కోసం అలవాటు పడి మోసాలు
- యువకులను ట్రాప్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ లక్షల్లో డబ్బులు డిమాండ్

దశ , నల్గొండ: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం లావుడి తండాకు చెందిన సరిత డిగ్రీ వరకు చదువుకుంది. ఈజీ మనీ కోసం అలవాటు పడిన సరిత ఇతరులను మోసాలు చేయడం అలవాటయింది. హైదరాబాద్, నల్లగొండ, మిర్యాలగూడ తదితర పట్టణాల్లో అద్దె ఇంట్లో ఉంటూ సమీప మహిళలతో పరిచయం పెంచుకునేది. అదును చూసి వారి సెల్ ఫోన్లు కొట్టేసేది. ఇటీవల ఓ యువకుడిని డబ్బులు డిమాండ్ చేయడంతోపాటు డబ్బులు ఇవ్వకుంటే చంపుతానని బెదిరించింది. దీంతో ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. అయితే.. పోలీసుల విచారణలో దిమ్మతిరేగే వాస్తవాలు వెల్లడయ్యాయి.. సరిత చేస్తున్న దందాలు చూసి పోలీసులే షాక్ అయ్యారు. తాను ట్రైనింగ్ ఐఏఎస్ అధికారినంటూ మాయ మాటలు.. పురుషులకు వలపు వలవేసి దోచేసేది. పలువురు యువకులను ట్రాప్ చేసి తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ లక్షల్లో డబ్బులు డిమాండ్ చేసింది. తరచూ మకాం మారుస్తూ స్నేహంగా నటిస్తూ డబ్బులు తీసుకోవడం, విలువైన సెల్ ఫోన్ లు కొట్టేయడం.. ఆ తర్వాత మరోచోటికి మకాం మార్చేదని పోలీసులు విచారణలో తేలింది.ఓ చోట ఏఎస్పీ కూతురునని.. రేడియాలజిస్ట్ డాక్టర్ అంటూ మాయ మాటలు చెప్పింది. ఏడాది క్రితం నార్కట్ పల్లిలో ఓ వైద్యున్ని బ్లాక్ మెయిల్ చేసి ఐదు లక్షలు వసూలు చేసింది. కలెక్టర్ అయ్యానంటూ అమాయకులను బురిడీ కొట్టించి బుట్టలో వేసుకుందని పోలీసులు వెల్లడించారు.సరితపై మలక్ పేట, చైతన్యపురి, ఉప్పల్, నల్గొండ టూ టౌన్, మిర్యాలగూడ వన్ టౌన్ పీఎస్ లో చోరీ కేసులు, నార్కట్ పల్లి, నల్గొండ వన్ టౌన్ పీఎస్‌లలో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. అయినా తన బుద్ధి మార్చుకోకుండా తిరిగి మోసాలకు పాల్పడుతున్న మాయదారి కిలాడి సరితను మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.